## క్లుప్తంగా

### పవర్ కిక్ కరాటే విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో పవర్ కిక్ కరాటే స్కూలు ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అమలాపురం పవర్ కిక్ కరాటే స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారని స్కూలు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. కటాస్ విభాగంలో బి.రిత్విక్, బి.అథర్వన్, ఎన్.ప్రణయ్, ఎం.ధన్యశ్రీ, సీహెచ్ శివసాయి, పి.ధన్య, పి.ఇందుప్రియలు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారన్నారు. జి.హార్థిక్, పి.శాన్వి, పి.అమృతవర్షిణి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని రజత పతకాలు సాధించారని చెప్పారు. ఈ పోటీలకు రిఫరీలుగా అల్లాడి నాగ దుర్గారావు, తిక్కా యశ్వంత్ వ్యవహరించారు.

### గంజాయి విక్రయదారుల అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

**ముమ్మిడివరం:** మండలంలోని అన్నంపల్లి అక్విడెక్టు వద్ద గంజాయి కలిగిఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 15న అన్నంపల్లి అక్విడెక్టు వద్ద గంజాయి విక్రయిస్తున్న బండారు మణికంఠ, కొప్పిశెట్టి ప్రీతి సునీల్, దాసరి అనిరుధ్, నిమ్మన మణికంఠలను అరెస్ట్ చేశారు. వారి నుంచి కేజీన్నర గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.కొండయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. ఎవరైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అమ్మినా, రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ కొండయ్య హెచ్చరించారు.

### అపోహలు వీడి నేత్రదానం చేయాలి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న లయన్స్ ప్రతినిధులు

**యానాం:** నేత్రదానంపై అందరూ అపోహలు వీడి మరొకరికి చూపునిచ్చేందుకు ముందుకు రావాలని యానాం లయన్స్ క్లబ్ పిల్లారా యశాఖ అధ్యక్షుడు పులవర్తి శ్రీను పేర్కొన్నారు. ఆదివారం యానాం పెన్షనర్స్ అసోషియేషన్ 25వ సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలువురు విశ్రాంత ఉద్యోగులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం అంటే కళ్లను మొత్తం సేకరించరని కేవలం కార్నియాను మాత్రమే సేకరిస్తారని చెప్పారు. సేకరించిన కార్నియాలను ఇద్దరు అంధులకు అమర్చి చూపునిస్తారన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు దంగుడు బియ్యం సత్యనారాయణ, డి.రామకృష్ణ పాల్గొన్నారు.

### ఏఎంసీ చైర్‌పర్సన్ డోలామణికి సత్కారం



డోలామణి దంపతులను సత్కరిస్తున్న జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరావు

**అమలాపురం రూరల్:** అమలాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన బండారులంకకు చెందిన దంగేటి డోలామణి దంపతులను వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు, హైసూ్కల్ ఎస్ఎంసీ చైర్మన్ పెదపూడి బాబురావులు తదితరులు ఆదివారం బండారులంకలో వారి స్వగృహం వద్ద సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు కాసిన నాగ సత్యనారాయణ, సొసైటీ సభ్యుడు బట్టు టాక్సీరామ్, పడవల నెహ్రూ, చిన్న, కటకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### శెట్టిబలిజలకు ప్రాధాన్యం

**అల్లవరం:** టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యమిస్తామని శాసనమండలి వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అల్లవరం మండల శెట్టిబలిజ సాధికారిత సమావేశం గుడ్డివానిచింత వద్ద కస్తూరి ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. శెట్టిబలిజ సాధికారిత సమితి డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, జిల్లా డైరెక్టర్ గుబ్బల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి పేరిట రూ.5 కోట్లతో కల్యాణ మండపం నిర్మిస్తామని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

# శాకంబరీ శరణు



శాకంబరి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి



ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మ తల్లి అమ్మవారు



శాకంబరి అలంకరణలో జ్ఞాన సరస్వతి అమ్మవారు

- ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం
- దాతల సాయంతో ప్రసాద వితరణ, చంటి పిల్లలకు పాలు పంపిణీ

**అమలాపురం టౌన్:** ఆషాఢ మాసం సందర్భంగా అమలాపురంలోని కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారినే కాకుండా గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపాన్ని కూడా కూరగాయల తోరణాలతో అలంకరించారు. దాదాపు టన్ను కూరగాయలతో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఈ అలంకరణ చేశాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు యెండూరి వెంకట్రామయ్య, వంకాయల కాశీ, నంబూరి సత్యనారాయణమూర్తి, వరదా సూరిబాబు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఆషాఢ మాసం సందర్భంగా అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆదిశేష నిలయంలో గౌతమి మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో వజ్ర వారాహి అఖండ హోమం వద్ద అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**సత్తెమ్మతల్లికి రంగుల గాజుల అలంకరణ**

**ముమ్మిడివరం:** ఆషాఢ మాసం సందర్భంగా చెయ్యేరు గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి అమ్మవారిని ఆదివారం రంగురంగుల గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయంలో దాతల సాయంతో ఉచిత ప్రసాద వితరణ, చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు. ముమ్మిడివరం ఎస్ఐ కె.సురేష్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

### ఘనంగా ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం



తాళ్లరేవు గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**తాళ్లరేవు:** స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసి యున్న ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారిని రత్సవారిపేటలోని అంగడి గుడి నుంచి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మహిళలు పసుపు నీళ్లు చల్లుతూ అమ్మవారికి స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అదేవిధంగా ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా పి.మల్లవరం హైసూ్కల్ వద్ద వేంచేసియున్న సత్తెమ్మ తల్లి అమ్మవారికి స్థానికులు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, తాళ్లరేవు ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు, స్థానిక నాయకులు వి.శ్రీనివాస్, బొంతు శ్రీను, పండు తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లు వందనం

### కరోనాలో అందించిన సేవలు మరువలేం



పార్వతికి వృద్ధాప్య పింఛను అందిస్తున్న వలంటీర్ నాగరాజు

ఇతను పేరు కట్టా వెంకట నాగరాజు. అమలాపురం సూర్యనగర్ సచివాలయం పరిధిలో 16వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. కరోనా సమయంలో అందరూ ఇళ్లల్లో ఉంటే వలంటీర్ నాగరాజు మాత్రం తనకు కేటాయించిన 50 ఇళ్లకు రోజూ తిరుగుతూ వారికి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తూ అవసరమైన నిత్యావసరాలన్నీ వారికి అందించాడు. కరోనా సమయంలో అతడు అందించిన సేవలను వారెవరూ నేటికీ మరిచిపోలేదు. అందుకే నాగరాజు వారందరికీ ఇంట్లో వ్యక్తిగా మారిపోయాడు.

### కొడుకులా చేదోడువాదోడుగా ఉంటాడు



ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుతుండగానే ఇంటి తలుపు తట్టేది మా వలంటీర్ నాగరాజే. కొడుకులా ప్రతి పనిలో చేదోడువాదోడుగా ఉంటాడు. ముఖ్యమంత్రి జగన్ మాలాంటి వృద్ధుల పాలిట దేవుడైతే పింఛన్లు అందించే వలంటీర్లు నేను కొడుకులు, కూతుర్లుగానే భావిస్తాను. ఎందుకంటే వాళ్లు మాకు ఆత్మీయ బంధువుల్లా మారిపోయారు. మా వలంటీర్ రాజు అయితే కుటుంబ సభ్యుడిగా మాతో కలిసిపోయాడు.

– రాయుడు పార్వతి, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు, అమలాపురం

### వరదొచ్చినపుడు వలంటీర్ల సేవలు



వరద నీరొచ్చినపుడు నిత్యావసర సరకులు తెచ్చి అందచేస్తున్న వలంటీర్లు

కాట్రేనికోన మండలం మగసానితిప్పలో 120 కుటుంబాలకు గాను ఇద్దరు వలంటీర్లు ఉన్నారు. గోదావరికి వరదలొచ్చినపుడు వలంటీర్లు ప్రభుత్వం అందించే నిత్యావసర సరకులను గోదావరి పాయలో బోటుపై మూడు కిలోమీటర్లు ప్రయాణించి మండల కేంద్రం కాట్రేనికోన వెళ్లి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారితో దరఖాస్తు చేయించి తామే స్వయంగా దగ్గరుండి ఆయా పథకాలు మంజూరయ్యేలా చూసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందజేయడమే కాకుండా లబ్ధిదారులకు ఏ అవసరమొచ్చినా సాయం చేయడానికి ముందుంటారు. అందుకే వారి పరిధిలోని కుటుంబాలన్నింటికీ వలంటీర్లు ఆప్తులయ్యారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



పెనుమల్లెలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు విరాళం అందజేస్తున్న సంఘ సభ్యులు

**కాట్రేనికోన:** మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. పల్లం గ్రామ పంచాయతీలో ఉన్న కాలభైరవ స్వామి ఆలయ నిర్మాణ పనులను, పెనుమల్లె గ్రామంలో రూ.1.66 కోట్ల ఏఐఐబీ నిధులతో గొరగనమూడి ఆర్అండ్‌బీ రహదారి నుంచి పెనుమల్లె మీదుగా లక్ష్మీవాడ వరకూ నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం పితృవియోగంతో బాధపడుతున్న నీలరేవు గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు మల్లాడి ప్రసాద్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మల్లాడి బాబ్జి, నారాయణరావు, కోలాటి సత్యం, సంగాని మునీంద్ర, వర్మ, మాదే నూకరాజు తదితరులున్నారు.

**విగ్రహ నిర్మాణానికి రూ.51 వేల అందజేత**

**ఐ.పోలవరం:** ఎదుర్లంక వారధి వద్ద నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం నిమిత్తం మండలంలోని ఎదుర్లంక గ్రామం గణేష్ నగర్‌కు చెందిన శ్రీలక్ష్మీగణపతి ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు రూ.51 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ విగ్రహ నిర్మాణానికి సహకరించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పలువురు అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులున్నారు.

# గృహనిర్మాణ లబ్ధిదారులకు సహాయం అందజేత



లబ్ధిదారులకు ఆర్థిక సహాయ పత్రాలను అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

**యానాం:** నియోజకవర్గ పరిధిలో మురికివాడల అభివృద్ధి పథకం ఆర్థిక సాయంతో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సహాయ చెక్కులను ఆర్ఏఓ మునిస్వామి అందజేశారు. మొత్తంగా 53 మంది లబ్ధిదారులకు మొదటి, రెండో, మూడో విడతకు సంబంధించిన రూ.58,80,000 విలువైన సహాయ పత్రాలను అందజేశారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ ఈ మొత్తం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు. ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి నుంచి వచ్చిన స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా రుద్రహోమం



రుద్రాక్ష పూజ నిర్వహిస్తున్న అర్చకులు సాయిప్రసాద్

**ఐ.పోలవరం:** ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం ఘనంగా జరిగింది. పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే స్వామికి గణపతి పూజ, రుద్రహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**కురంగేశ్వరునికి రుద్రాక్ష పూజ**

**తాళ్లరేవు:** మండలంలోని పాతకోరంగిలో వేంచేసియున్న కురంగేశ్వరునికి ఆదివారం రుద్రాక్ష పూజను వైభవంగా నిర్వహించారు. పవిత్ర మాసశివరాత్రి, పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు కొత్తలంక సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# బిల్లులు చెల్లించని సర్వీసులను తొలగిస్తాం

**అల్లవరం:** ఈ నెల 16వ తేదీలోగా పెండింగ్ బిల్లులను చెల్లించని ఆక్వా, గృహ విద్యుత్ వినియోగదారుల సర్వీసులను సోమవారం నుంచి తొలగించనున్నట్లు ఈఈ రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించుకోవాలని సూచించారు.

# మోకాళ్ల రక్షణకు నడకే మార్గం



మోకాళ్ల నొప్పుల నివారణపై సూచనలిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

**అమలాపురం టౌన్:** మోకాళ్ల రక్షణకు నడకే మార్గమని ఎముకల వ్యాధుల నిపుణుడు డాక్టర్ అనిల్ కుమార్ చొల్లంగి సూచించారు. అమలాపురం సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ రోడ్డులో ఆర్థోపెడిక్ హాస్పటల్‌లో 'మోకాలు నొప్పులు–తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడారు. స్థూలకాయం వల్ల మోకాళ్లపై శరీర భారం పెరిగి జాయింట్స్‌లో అరుగుదల ఏర్పడి మోకాళ్ల నొప్పులు ఉత్పన్నమవుతాయని చెప్పారు. దీనికి నివారణగా ప్రతి మనిషి నడక తదితర వ్యాయామాల ద్వారా శరీర బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. సదస్సుకు ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు. వాకర్స్ అంతర్జాతీయ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లను అందజేశారు.

### ఎరుపెక్కిన గౌతమీ గోదారమ్మ



యానాం వద్ద శోభాయమానంగా గౌతమీ గోదావరి

**యానాం:** వేదంలా ఘోషించే గోదావరి నది ఎర్రబడింది. ఎరుపురంగు చీర కట్టుకున్న పల్లె పడుచులా గోదారమ్మ తుళ్ళితుళ్ళి పడుతోంది. ఇప్పటివరకూ నీలం రంగుతో ఉన్న గోదావరి మహారాష్ట్ర ఎగువప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అక్కడి నుంచి వస్తున్న బురద నీటితో ఎరుపు రంగును సంతరించుకుని చూపరులను ఆకర్షిస్తుంది. దీంతో ఆదివారం యానాం రాజీవ్‌బీచ్‌కు తరలివస్తున్న సందర్శకులు గోదారమ్మ ఎరుపెక్కిన దృశ్యాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### నక్షత్ర పూజలు



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వర స్వామి

**ఉప్పలగుప్తం:** మండలంలోని భీమనపల్లి అనంగేశ్వర స్వామి వారి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివునికి రుద్రాభిషేకం, లక్షపత్రి పూజలు చేసి స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### బాలభానుకు శతావధాన శిరోమణి బిరుదు



బాలభానును శతావధాన శిరోమణి బిరుదుతో సత్కరిస్తున్న వేదపండితులు

**అమలాపురం రూరల్:** అమెరికా తెలుగు మహా సభల్లో పాల్గొని స్వగ్రామానికి తిరిగి వచ్చిన ఆకెళ్ళ బాలభానుకు ఆదివారం సాయంత్రం భట్నవిల్లిలో పౌర సన్మానం చేసి శతావధాన శిరోమణి బిరుదును ప్రదానం చేశారు. స్మార్త సామ్రాట్ గరిమెళ్ళ విశ్వనాథశాస్త్రి, చంద్రమౌళి భాస్కరశర్మ శివాచార్యుల ఆధ్వర్యంలో బాలభాను, విశ్వనాథశర్మ దంపతులను సత్కరించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, సాహితీప్రియులు పాల్గొని బాలభానును అభినందించారు.

### నీటి కుక్కల సంచారం



నడిపూడి కాలువ వద్ద కనిపించిన నీటి కుక్క

**అమలాపురం రూరల్:** ఈదరపల్లి–నడిపూడి బెండా కాలువలో ఆదివారం నీటి కుక్కలు హల్‌చల్ చేశాయి. గోదావరి వరదల సమయంలో సంచరించే ఈ నీటి కుక్కలు నడిపూడి కాలువ వద్ద ఆదివారం కనిపించంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. వీటి దంతాలు పెద్దవిగా ఉంటాయని, అవి కరిస్తే ప్రాణాలకే ప్రమాదమని బాటసారులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి వాటిని పరిశీలించారు.

### ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విక్టరీ విద్యార్థులు

**అమలాపురం రూరల్:** నెల్లూరులో ఇటీవల జరిగిన మస్తానయ్య ఇంటర్నేషనల్ ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో ద్రాక్షారపు సాత్విక్ కర్ణాటక క్రీడాకారుడు ఐఎమ్ టైటిల్ గ్రహీత దేవకి ప్రసాద్‌పై విజయం సాధించి సంచలనం సృష్టించాడు. రేటింగ్ కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించి రూ.3 వేల నగదు బహుమతి, 150 రేటింగ్ పాయింట్లు సాధించాడు. మరో క్రీడాకారుడు బండారు నానిబాబు అన్ రేటింగ్ కేటగిరీలో ప్రథమ స్థానం సాధించి రూ.3 వేల నగదు బహుమతి పొందాడు. అలాగే చింతపల్లి సూర్య, తోలేటి శ్రీకాంత్ ప్రత్యేక బహుమతులు సాధించారని విక్టరీ ప్రిన్సిపాల్ తాడి వెంకటసురేష్ ఆదివారం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



యానాం బైపాస్ రహదారిలో ప్రమాదానికి గురైన యువకుడు

**తాళ్లరేవు:** జాతీయ రహదారి 216 యానాం బైపాస్ రహదారిలోని గణపతినగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెదపూడి గ్రామానికి చెందిన సతీష్, రాజేష్‌లు యానాం వచ్చారు. అక్కడ పనిచూసుకుని తిరిగి బైక్‌పై వెళుతుండగా కాకినాడ నుంచి తాటిపాక ఓఎన్జీసీ సైట్‌కు వెళుతున్న ట్యాంకర్‌ను బలంగా ఢీకొన్నారు. ప్రమాదంలో సతీష్, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న కోరంగి పోలీసులు హుటాహుటీన 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదే ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున మరో ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. కోళ్ల లోడుతో వెళుతున్న వ్యానును, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో వ్యానులో ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.